క్లుప్తంగా

ఓటరు నమోదు పక్కాగా ఉండాలి

తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బంట్వారం: ఓటరు నమోదు ప్రక్రియ పక్కాగా ఉండాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం బీఎల్‌ఓలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19వ తేదీలోపు ఓటరు తుది జాబితా సిద్ధం చేయాలని, కొత్త ఓటర్ల నమోదుతో పాటు, జాబితాలో మార్పు చేర్పులు గడువులోగా పూర్తి చేయాలని చెప్పారు. ఇందుకు సంబంధించి బూత్ లెవల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ దరఖాస్తులు స్వీకరించాలని వెల్లడించారు.

కాంగ్రెస్‌లో ఎవరూ చేరలేదు

జెడ్పీటీసీ మహిపాల్



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ

దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండలం గోకఫసల్‌వాద్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు సుమారు 200మంది కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు తప్పుడు సమాచారం ఇచ్చారని, ఆ పార్టీలో కేవలం ఇద్దరు ముగ్గురు మాత్రమే చేరారని జెడ్పీటీసీ మహిపాల్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో వేలాదిమంది చేరుతున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్‌కూడా రాదన్నారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి వేల కోట్ల రూపాయల నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేశవరెడ్డి, నాయకులు బాలుగౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జోనల్ స్థాయి టోర్నీ

జోనల్ కార్యదర్శి సత్యనారాయణ

మోమిన్‌పేట: ఈ నెల 13వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే (ఎస్‌జీఎఫ్) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ స్థాయి క్రీడలు మోమిన్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతాయని జోనల్ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. మోమిన్‌పేట, మర్పల్లి, బంట్వారం మండలాల పరిధి పాఠశాల విద్యార్థినీ, విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్‌లో పాల్గొనే వారు అండర్ 17లో 10వ తరగతి చదువుతూ ఉండి 2007 జనవరి 1వ తేదీకి ముందు జన్మించి ఉండాలని వివరించారు. అండర్ 14లో 8వ తరగతి చదువుతూ ఉండి 2010 జనవరి 1వ తేదీకి పూర్వం జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఆయా పాఠశాలల నుంచి బోనఫైడ్‌ను తీసుకొని 13న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి రావాలని చెప్పారు.

క్రికెట్ జట్ల ఎంపిక



ఎంపికైన బాలుర జట్టు

అనంతగిరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ బ్లాక్ గ్రౌండ్‌లో వికారాబాద్ జోనల్ స్థాయి అండర్–14 క్రికెట్ బాలుర, బాలికల సెలక్షన్ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారని, అందులో ప్రతిభ చూపిన వారిని జోనల్ జట్టుకు ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రటరి రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి తాళం

సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె ఎఫెక్ట్



తాళం వేసి ఉన్న ఎమ్మార్సీ కార్యాలయం

దౌల్తాబాద్: సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెతో ఎమ్మార్సీకి తాళం పడింది. మండల విద్యావ్యవస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగులే ఎక్కువగా ఉన్నారు. ఇందులో కేజీబీవీ ఉద్యోగులు, సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు, డాటాఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, మెసెంజర్లే అధికం. తమ సమస్యల సాధనకు సమ్మెబాట పట్టడంతో సేవలు నిలిచిపోయాయి. కేజీబీవీల్లో పనిచేసే బోధకులు సైతం నిరసన బాటలో ఉండటంతో చదువులకు అంతరాయం కలిగింది.

బడిలో 'విజ్ఞాన' గోడలు

- ప్రైవేటుకు దీటుగా విద్యా బోధన
- ప్రహరీపై విద్యార్థులను ఆకర్షించే బొమ్మలు, పాఠ్యాంశాలు
- విద్యాలయాన్ని తీర్చిదిద్దిన సర్పంచ్, ప్రధానోపాధ్యాయుడు
- స్టూడెంట్స్ సంఖ్య పెంచేందుకు సొంత ధనం వినియోగం
- హర్షం వ్యక్తంచేస్తున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు



సుందరీకరించిన మెట్టుగడ్డతండా ప్రాథమిక పాఠశాల



గోడలపై విజ్ఞానం అందించే బొమ్మలు, ఆంగ్లంలో వివరాలు

దోమ: ప్రభుత్వ పాఠశాల దశదిశ మార్చాలని, పోటీ ప్రపంచంలో నిలబడేలా పేద విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులు, స్థానిక సర్పంచ్ సంకల్పించారు. అనుకున్నదే తడవుగా ప్రధానోపాధ్యాయుడి తన సొంత నిధులతో సరస్వతీ నిలయాన్ని చూడచక్కగా ముస్తాబు చేయించారు. బడిగోడలను విజ్ఞానాన్ని పంచేలా రంగులు వేయించి, బోధనకు ఉపకరించే బొమ్మలను, విద్యార్థులు పట్టు సాధించడానికి దోహదపడే చార్టులను, సులభంగా విద్యనభ్యసించేలా పాఠ్యాంశాలను రాయించారు. ప్రధానోపాధ్యాయుడి తపన చూసిన సర్పంచ్ తనవంతు సహకారం అందజేసి విద్యాకుసుమాలకు అండగా నిలిచారు.

బడిచుట్టూ పరిశుభ్రత, పచ్చదనం

గొట్లచెల్కతండా అనుబంధ గ్రామమైన మెట్టుగడ్డ తండా ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా.. 24 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఏళ్ల క్రిత నిర్మించిన పాఠశాల కావడంలో అది శిథిలావస్థకు చేరుకుంది. గమనించిన ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తన సొంత నిధులతో పాటు సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ సహకారంతో పాఠశాల రూపురేఖలను మార్చారు. విద్యార్థులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ప్రతి గదికి విద్యుత్ సౌకర్యం, కిటికీలు, తలుపులు, ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు అమర్చారు. పాఠశాల పరిసర ప్రాంతాలను ఆహ్లాదకరంగా ఉండేలా చేసి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

ఆటో సౌకర్యం..

విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతుండటంతో బడిని మూసేయటానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టినట్లు సర్పంచ్‌కు సమాచారం అందింది. దీంతో సొంత నిధులు వెచ్చించైనా విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. బ్రహ్మణపల్లి అనుబంధ గ్రామమైన మాలగుట్టతండా నుంచి మెట్టుగడ్డతండాకు రెండు కి.మీ. దూరం ఉంది. అక్కడి నుంచి 10 మంది విద్యార్థులను ఇక్కడి బడిలో విద్యనభ్యసించేందుకు సొంత డబ్బుతో ఆటోను ఏర్పాటు చేసి, సంఖ్యను పెంచారు. దీంతో సర్పంచ్‌ని విద్యార్థుల తల్లితండ్రులు అభినందించారు.

సౌకర్యాలు బాగున్నాయి



విద్యాలయంలో సౌకర్యాలు బాగుతున్నాయి. గతంలో పాఠశాల అంతగా బాగుండేది కాదు. ఇప్పుడు అద్భుతంగా తీర్చిదిద్దారు. గోడలపై వివిధ రకాల బొమ్మలు గీయడం, పాఠ్యాంశాలను రాయడంతో సులభంగా నేర్చుకుంటున్నాం. ఉపాధ్యాయులు తమకు ఆంగ్లమాధ్యమంలో చక్కగా బోధిస్తున్నారు.

– నిఖిత, ఐదవ తరగతి, మెట్టుగడ్డతండా

విద్యార్థుల అభ్యున్నతికి కృషి



సర్కారు బడిలో చదువుకుంటున్న విద్యార్థుల అభ్యున్నతికి తనవంతు సహాయసహకారాలు అందజేశాను. ఎల్లవేళలా అండగా ఉంటాను. స్కూల్‌ను మూసేయాల్సిన పరిస్థితులు రాగా.. సొంత నిధులు వెచ్చించి, విద్యార్థుల సంఖ్యను పెంచాను. మరింత పెంచేలా చొరవ తీసుకుంటా.. తనవంతు సహాయం అందజేసి విద్యాలయం రూపురేఖలు మార్చేశాం.

– లక్ష్మణ్ నాయక్, సర్పంచ్, గోట్లచెల్కతండా

అంకితభావంతో పని చేస్తున్నాం



విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తున్నాం. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాం. పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ సహకారం మరువలేనిది. పాఠశాల రూపురేఖలు మార్చాం. విద్యార్థుల సంఖ్యను పెంచాం. సులభమైన పద్ధతిలో విజ్ఞానం అందించేందుకు బడి గోడలపై బొమ్మలను గీయించాం. పాఠ్యాంశాలను రాయించాం. విద్యాలయంలో మౌలిక వసతులు ఏర్పాటు చేశాం. కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం.

– సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు, మెట్టుగడ్డతండా

శ్రావణమాసం ప్రత్యేక పూజలు

కొడంగల్ రూరల్: శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని మహాదేవుని ఆలయం, శ్రీజగద్గురు నిరంజన మఠం, గాడిబాయి శివాలయాల్లో రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా శివలింగానికి పంచామృతంతో అభిషేకం, రుద్ర నమక, చమక అధ్యాయాలతో రుద్రాభిషేకం, మారేడు దళాలతో బిల్వాష్టకం, నైవేద్యాలు సమర్పించారు. మహాదేవుని క్షేత్రంలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.



విశేష అలంకరణలో బసవలింగేశ్వర స్వామి

పోస్టల్ బీమా.. పేదలకు ధీమా



బీమా డబ్బులు చెల్లించిన డ్రైవర్లతో ఎంపీపీ, తపాల ఉద్యోగులు

తపాలా అధికారులు, ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా

యాలాల: పోస్టల్ శాఖలో కొత్తగా ప్రవేశపెట్టిన తక్కువ ప్రీమియంతో అధిక బీమా చెల్లింపులతో పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తపాలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాద బీమా, ఇతర పాలసీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, తపాలశాఖ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ సూరజ్‌సింగ్ రాజ్‌వార్, ఐపీపీబీ మేనేజర్ క్రాంతిలు మాట్లాడారు.

ఏడాదికి రూ.399 కిస్తు

పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో టాటా జనరల్ బీమాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఏడాదికి ప్రమాద బీమా పాలసీ రూ.399 ప్రీమియం చెల్లిస్తే, రూ.10లక్షల బీమా వర్తిస్తుందన్నారు. వీటితో పాటు ప్రమాదంలో గాయపడిన వారికి రూ.లక్ష, ఆస్పత్రి ఖర్చులకు కూడా బీమా డబ్బులు అందుతాయని పేర్కొన్నారు. ఈ పాలసీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని పలు వాహనాల డ్రైవర్ల పేరిట ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా.. ప్రమాద బీమాకు కట్టాల్సిన కిస్తును చెల్లించారు. కార్యక్రమంలో యాలాల ఎస్‌పీఎం ఫిరోజ్‌బాబా, మెయిల్ ఓవర్సీస్ రాములు, బీపీఎంలు పాండురంగారెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్

వికారాబాద్ అర్బన్: సీజనల్ వ్యాధుల పట్ల పుర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల సూచించారు. సోమవారం మున్సిపల్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులపై మున్సిపల్, వైద్య అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో నీరు నిలవడం వలన దోమలు తదితర కీటకాలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, మునిసిపల్ అధికారులు శ్రద్ధ తీసుకొని వాన నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు కూడా సహకరించాలని, ఇంటి పరిసరాల్లో ఎక్కడైనా నీటి గుంతలు ఏర్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ జాకిర్ అహ్మద్ మెడికల్ ఆఫీసర్ నిఖిల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మొహినుద్దీన్ జవాన్లు, మెడికల్ సిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఢీకొట్టేది బీజేపీనే..

- అధికారం చేపట్టేది కమలమే
- ఆ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి జనార్దన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్ రెడ్డి

అనంతగిరి: తెలంగాణ ప్రజలు బీజేపీ పార్టీని కోరుకుంటున్నారని, కచ్చితంగా రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని ఆ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి బి.జనార్దన్ రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. సోమవారం అనంతపద్మనాభ స్వామిని స్థానిక నాయకులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జనార్దన్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు ఒక్కటేనని, మజ్లిస్‌తో జతకట్టే బీఆర్‌ఎస్.. బీజేపీ దోస్తి అనేది అవాస్తవమని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు గట్టిపోటి ఇచ్చేది బీజేపీనని స్పష్టం చేశారు.

పెరిగిన ఓటు బ్యాంకు

చేవెళ్ల పార్లమెంట్ టిక్కెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ గెలుపు కోసం కలిసి పని చేస్తామని, 2019 ఎన్నికల తరువాత రాష్ట్రంలో బీజేపీ పుంజుకుందని జనార్దన్ రెడ్డి వెల్లడించారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో సత్తా చాటిందని, పార్లమెంట్ ఎన్నికల్లో 20 శాతం ఓటు బ్యాంకు పెరిగిందని పేర్కొన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని మెజార్టీ అసెంబ్లీ స్థానాలతో పాటు పాటు పార్లమెంట్ స్థానం బీజేపీ కైవసం చేసుకుంటుందని, ఈ సారి రాష్ట్రం, కేంద్రంలోనూ అధికారం చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజు, మాధవరెడ్డి, సీనియర్ నాయకులు కేపీ రాజు, రాములు, విజయ్ భాస్కర్ రెడ్డి, బుస్స శ్రీకాంత్ , వివేకానంద్ రెడ్డి, అనిల్, నిరంజన్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

యాలాల: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజారిటీ సాధించి, అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల పార్టీగా కాంగ్రెస్‌కు గుర్తింపు ఉందని, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్‌ల నాయకత్వంలో పార్టీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

డీటీ విజయేందర్‌కు సన్మానం

తాండూరు రూరల్: ఇటీవలే బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్‌ను సోమవారం తాండూరుకు చెందిన స్వేరో ఇంటర్నేషనల్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. వారి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో గోవింద్, శివ, విజయేందర్, మహేందర్, సుధాకర్, సాయి ప్రసాద్, వెంకట్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారితే ఒరిగేదేం లేదు

- వికారాబాద్‌లో భారీ మెజార్టీతో గెలుస్తాం
- బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

అనంతగిరి: పార్టీ మారినంత మాత్రాన ఒరిగేదేం లేదని, కాంగ్రెస్ నుంచి కూడా రావడానికి సిద్ధంగా ఉన్నారని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని క్లబ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నాయకులు ఎమ్మెల్యేపై బురదజల్లే ప్రయత్నం చేయవద్దని, ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో వికారాబాద్‌లో ఎమ్మెల్యే ఆనంద్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు విజయకుమార్, లక్ష్మీకాంత్ రెడ్డి, రాంరెడ్డి, మండల అధ్యక్షుడు కమాల్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, కౌన్సిలర్ గోపాల్, ఎంపీటీసీ గౌస్, సర్పంచ్ మాధవరెడ్డి, సీనియర్ నాయకులు మేక శేఖర్ రెడ్డి, పాండు ముదిరాజ్, సురేష్, గయాజ్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాంబరి ఉత్సవాలు

రామలింగేశ్వరున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తదితరులు

బషీరాబాద్: ఏకాంబరి రామలింగేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బషీరాబాద్ మండలం నీళ్లపల్లి అటవీ ప్రాంతం సప్తకొలనులలో వెలసిన స్వామి వారి దర్శనం కోసం సోమవారం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు గ్రామాల నుంచి భక్తజనం కదిలి వచ్చారని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ గోపాల్‌రెడ్డి తెలిపారు. దక్షిణ కాశిగా పేరుగాంచిన రామలింగేశ్వరుడి దర్శనానికి ముందు భక్తులు సప్త కొలనులలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా.. రామలింగేశ్వర స్వామి వారి దర్శనం అనంతరం భక్తులు కొలనులోని యాకూబ్‌సాబ్ దర్గాను దర్శించుకున్నారు. అలాగే ముస్లిం భక్తులు కూడా దర్గాను దర్శించుకున్నారు. పోలీసులు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా రథోత్సవం

స్వామి వారి రథాన్ని ఆలయ ధర్మకర్తల మండలి తీరొక్క పూలతో తీర్చి దిద్దారు. రథంపై పరమ శివుడి విగ్రహాన్ని ఉంచి వీధుల గుండా ఊరేగించారు. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాలు క్రయవిక్రయదారులతో కిటకిటలాడాయి.

ఎమ్మెల్యే పూజలు

రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ గోపాల్‌రెడ్డి ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యేతో ఎంపీపీ కరుణ, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ అజయ్‌ప్రసాద్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాజు, నాయకులు సుధాకర్‌రెడ్డి, రామునాయక్, రుక్మారెడ్డి, నీళ్లపల్లి, జలాల్‌పూర్, ఇస్మాయిపూర్ తండాల సర్పంచులు స్వామివారిని దర్శించుకున్నారు.

సంక్షిప్త వార్తలు

• ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

తాండూరు రూరల్: ప్రైవేట్ వాహనాల కంటే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం అని తాండూరు జెడ్పీటీసీ మంజుల అన్నారు. సోమవారం తాండూరు నుంచి చెంగోల్ మీదగా పర్వాతపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సును ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల కోసం బస్సు నడపాలని డీపో మేనేజర్‌ను కోరగా.. బస్సు వేశారని తెలిపారు. పర్వాతపూర్ సర్పంచ్ లాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, యువ నాయకులు ఉన్నారు.

• ఘనంగా పూజలు

ధారూరు: శ్రీ కపిలేశ్వరస్వామికి శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులు ఘనంగా పూజలు చేశారు. ముందుగా శివలింగానికి జలం, పంచామృతంతో అభిషేకం చేశారు. పాలాభిషేకం అనంతరం అలంకరించి నైవేద్యం సమర్పించారు. హారతి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

• బీసీలకు కేటాయించండి

అనంతగిరి: రాజకీయ పార్టీలకు ఏడు శాతం లేని అగ్రకులాలు నాయకత్వం వహించడం ఏమిటని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీందర్ మహరాజ్ ప్రశ్నించారు. సోమవారం ఆయన మాట్లాడారు. పార్టీల్లో అధినాయకత్వాన్ని బీసీలకు ఇవ్వాలని, ముఖ్యమంత్రి పీఠాన్ని సైతం దళితులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా కో కన్వీనర్ వెంకట రాములు, వికారాబాద్ మండల కన్వీనర్ మల్లికార్జున్, శేఖర్, రవి, బాబు ఉన్నారు.

• అభివృద్ధిలో భాగస్వాములు కండి..

పూడూరు: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ కుర్వ రవి అన్నారు. సోమవారం పూడూరు మండలం మీర్జాపూర్‌లో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో అవసరం ఉన్నచోట సీసీరోడ్లతో పాటు సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. ఉప సర్పంచ్ కృష్ణవేణి, వార్డు సభ్యులు మక్బూల్, సాదక్, బాబర్, పెంటయ్య, వెంకటయ్య, రాజుగౌడ్ ఉన్నారు.

• మా గోడు వినండి సారూ..



కుల్కచర్ల: సారూ.. మా గోడు విని, సమస్యలు పరిష్కరించాలని సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు కేజీబీవీ ప్రత్యేక అధికారి దేవి ఆధ్వర్యంలో మంత్రి మహేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. చాలీచాలని జీతంతో ఇబ్బంది పడుతున్నామని, ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని విన్నవించారు.

• సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేత

బొంరాస్‌పేట: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకుడు తిరుపతి రెడ్డి సోమవారం అందజేశారు. బొంరాస్‌పేట మండలం తుంకిమెట్లకు చెందిన నాగేంద్రప్పకు రూ.లక్ష, దుద్యాల మండల కేంద్రానికి చెందిన అంజిలయ్యకు రూ.1.50లక్షల చెక్కులను అందజేశారు.

• క్రీడా దుస్తుల పంపిణీ

కుల్కచర్ల: క్రీడాకారుల అభ్యున్నతికి సహకరించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. సోమవారం సాల్వీడుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సుధాకర్.. స్థానిక జెడ్పీ పాఠశాలకు చెందిన 30 క్రీడాకారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. ఎంఈఓ హరిశ్చందర్, పీఈటీ కేశవులు, ప్రభాకర్ ఉన్నారు.

నేడు వాలీబాల్ టోర్నీ

మండల కేంద్రం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్14, 17 జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలు, క్రీడాకారుల ఎంపిక ఉంటుందని వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, ఖాజ తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు 81878 91301, 99486 40187 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎప్పటికైనా గుర్తింపు

విద్యార్థుల ఉన్నతికి కృషిచేసే ఉపాధ్యాయులకు ఎప్పటికైనా గుర్తింపు, గౌరవం లభిస్తుందని మరికల్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడు రవికుమార్‌ను టీచర్లు సన్మానించారు.

• పట్టాలివ్వాలి

అనంతగిరి: రాంపూర్ తండా వాసులకు పట్టాలు ఇవ్వాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గిరిజనులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఏళ్లుగా సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నామని, 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం అసైన్‌మెంట్ కింద తామే అర్హులమని పేర్కొన్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, సర్పంచ్ పాండు నాయక్, సీపీఎం జిల్లా నాయకుడు మహిపాల్, నాయకులు శ్రీను నాయక్, రవి, రాందాస్, చందర్, రాజు, రాములు, గోపాల్ ఉన్నారు.

• మహిళలకు షీ టీమ్ భరోసా

తాండూరు: బాలికలకు, మహిళలకు షీ టీమ్ అండగా ఉంటుందని సబ్ డివిజన్ షీ టీం ఇన్‌చార్జి అన్నారు. సోమవారం పట్టణంలోని సెయింట్ మేరీ పాఠశాలలో షీ టీమ్ నిఘాపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా.. ఎస్సై రవూఫ్, షీ టీం సభ్యులు, కళాజాత బృందం పాల్గొన్నారు.

వర్షార్పణం

- దంచి కొట్టిన వానలు
- పంటపొలాల్లో చేరిన వరద నీరు



బాసపల్లిలో పత్తి చేనులోకి చేరిన వరద నీరు

దోమ: భారీ వర్షాలతో మండలంలో చెరువు, కుంటలు నిండి అలుగు పోస్తుండగా.. వాగులు, వంకలు వరద నీటితో పరుగులు తీస్తున్నాయి. ఫలితంగా దిగువన ఉన్న పంట పొలాలు నీటి మునిగి, రైతన్నలు కన్నీటి పర్యంతం అయ్యారు. గొడుగోనిపల్లి వాగు ఉధృతికి దోమ చెరువు అలుగు పోస్తుండగా.. సమీప రైతుల పంట పొలాలు నీట మునిగాయి. ప్రధాన బీటీ రోడ్లు ధ్వంసం అయ్యాయి. అటుగా బ్రహ్మణపల్లి వాగు ప్రవహిస్తుండటంతో.. వాహనాల రాకపోకలు స్తంభించాయి. బొంపల్లి గ్రామంలో అప్పగాళ్ల నర్సింహులు, లింగన్‌పల్లిలో గౌస్ అనే రైతు ఇళ్లు కూలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. బాసపల్లి గ్రామ సమీపంలోని ఓ రైతు పత్తి పొలంలో వరద నీరు చేరగా.. పంట మొత్తం ఎర్రబారిపోయింది. పాడైపోయిన పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి, తగిన పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.